క్లుప్తంగా

పిచ్చిమొక్కలతో వరాహ పుష్కరిణి



ఆగిరిపల్లి: శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వరాహ పుష్కరిణి (మెట్ల కోనేరు) పిచ్చి మొక్కలు మొలిచి చెత్తచెదారంతో అధ్వానంగా మారింది. కొన్ని నెలల కిందట దాతల సహకారంతో వేద శాస్త్ర పాఠశాల ఆధ్వర్యంలో పుష్కరిణిలోకి ఎవరూ ప్రవేశించకుండా చుట్టూ మెస్ ఏర్పాటు చేసి తాళాలు వేసి దేవదాయ శాఖ అధికారులకు ఇవ్వకుండా తమ దగ్గరే ఉంచుకున్నారు. దీంతో వేద శాస్త్ర పాఠశాల, దేవదాయ శాఖాధికారులు కానీ పుష్కరిణి బాగోగులు పట్టించుకోవడం లేదు. వరాహ పుష్కరిణి మెట్లపై పిచ్చి మొక్కలు, మద్యం సీసాల గాజు ముక్కలు దర్శమిస్తున్నాయి. ఇప్పటికైనా దేవదాయ శాఖాధికారులు గానీ, దాతలు గానీ స్పందించి వరాహ పుష్కరిణిని శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా లోలెవెల్ చప్టా



జి.కొండూరు: జి.కొండూరు నుంచి పినపాక వెళ్లే రహదారిలో కప్పలవాగుపై ఉన్న చప్టా వాహనచోదకులకు తలనొప్పిగా మారింది. కొద్దిపాటి వర్షం పడినా ఈ చప్టా మీదుగా వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వరద ఉధృతితో చప్టా మధ్యలో కాంక్రీటు కొట్టుకుపోయి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. ఈ చప్టా మీదుగా రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు భయపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చప్టా ఎత్తు పెంచాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళా హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి విమర్శ



తిరువూరు: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళా హక్కులను పాలకులు కాలరాస్తున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి విమర్శించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తిరువూరు పట్టణ మహాసభ ఆదివారం సుందరయ్య భవనంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు, యువతులు, విద్యార్థినులు, మహిళలపై దాడులు, లైంగిక దాడులు సర్వసాధారణ మయ్యాయని, ప్రభుత్వం ఇకనైనా మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఐద్వా తిరువూరు పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్. కుమారి, ఎం. లక్ష్మి ఎన్నికయ్యారు.

అంతులేని నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం



నూజివీడు: నూజివీడు నుంచి మైలవరం వెళ్లే మార్గంలో ఎన్నెస్పీ కాలువపై ఉన్న వంతెన రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉందని తెలిసినా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఈ మార్గంలో నిరంతరం భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు వేగంగా వెళ్తూ ఏమాత్రం అదుపుతప్పినా కాలువలోకి దూసుకువెళ్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అర్ధనారీశ్వరునిగా బాలగణపతి దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి స్వామివారు శ్రీ అర్ధనారీశ్వర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి మందిరంలో జరుగుతున్న వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సహస్ర నామార్చనను నిర్వహించారు. అలాగే సామూహిక లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. బిల్వార్చనలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వామివారికి ఉదయం, సాయంత్రం సహస్ర మోదక (ఉండ్రాళ్ల) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల ఆకలి కేకలు

- ఉచిత బస్సు ప్రయాణంతో ఆదాయానికి గండి
- కిరాయిలు లేక ఇబ్బందులు
- రోడ్డున పడ్డామని డ్రైవర్ల ఆవేదన



సర్వీసులు లేక నూజివీడు బస్టాండు వద్ద రోడ్డు వెంట నిలిపి ఉంచిన ఆటోలు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆటో డ్రైవర్ల కడుపు కొడుతోంది. సరైన ప్రత్యామ్నాయం చూపకుండానే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగం, నిరక్షరాస్యత కారణంగా అనేకమంది యువకులు కుటుంబ పోషణ కోసం ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా ఈఎంఐలో ఆటోను కొనుగోలు చేసుకుని వాటిని నడిపి జీవనం సాగిస్తున్నారు. ఆటోలో ప్రయాణించే వారిలో ఎక్కువమంది మహిళలే అని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం పథకంతో ఆటోలు మూలన పడే పరిస్థితులు నెలకొందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ఒక్క నూజివీడు పట్టణాన్నే కేంద్రంగా చేసుకుని సుమారు రెండు వేల ఆటోలు నడుస్తున్నాయి. ఉచిత బస్సుల వలన ఆటో కార్మికుల ఉపాధికి గండి పడింది. ముఖ్యంగా నూజివీడు–హనుమాన్ జంక్షన్, నూజివీడు–ఆగిరిపల్లి, నూజివీడు–విస్సన్నపేట, నూజివీడు–మైలవరం, నూజివీడు–ముసునూరు–గోపవరం రూట్లలో ఆటోలకు ఆదాయం పూర్తిగా పడిపోయింది. కూలి పనులకు వెళ్దామంటే రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తుండటంతో పనులు కూడా ఉండటం లేదని ఆటో డ్రైవర్లు పేర్కొంటున్నారు.

కుటుంబ ఖర్చులు, ఈఎంఐలు ఎలా..?

ఆటోపై వచ్చే ఆదాయంతోనే ఆటోకు సంబంధించి ఈఎంఐను కట్టుకోవడంతో పాటు కుటుంబ ఖర్చులు కూడా వెళ్లిపోతున్నాయని, ఇప్పుడు ఉచిత ప్రయాణం వలన తమకు ఆదాయం పూర్తిగా పడిపోయిందని, తాము రోడ్డున పడ్డట్లయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈఎంఐలు ఎలా చెల్లించాలో తెలియక ఆటో కార్మికులు తల్లడిల్లుతున్నారు. ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు, పర్మిట్లు, డీజిల్ ఖర్చులు వీటన్నింటిని కట్టుకుంటూ ఆటోను నిర్వహించాలంటే కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించి ఆటోవాలాలను ఆదుకున్నారు. ఈ పది వేలతో టైర్లు కొనుక్కోవడమో, ట్యాక్స్ చెల్లించడమో చేసేవారు. వీటి గురించి ఆలోచించాల్సిన పని ఉండేది కాదు. ప్రస్తుత పాలకులు ఎన్నికల ముందు అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ హామీలు గుప్పించి అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా ఇంత వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదు.

అనుబంధ రంగాలకూ నష్టమే...

ఆటోలకు సర్వీసు లేక మూలన పెట్టే పరిస్థితులు నెలకొనడంతో ఆటోకు సంబంధించిన అనుబంధ రంగాల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. మెకానిక్‌లు, పెయింటర్లు, ఆటోమొబైల్ దుకాణాల యజమానులు, టైర్ల దుకాణాలు, సీట్ కవర్ల దుకాణాల యజమానులు, ఎలక్ట్రీషియన్లు, బ్యాటరీ దుకాణాలు తదితర వారిపై ప్రభావం పడనుంది.

మా పొట్ట కొట్టారు



ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నూజివీడు–ఆగిరిపల్లి రూట్‌లో గతంలో ఆయిల్ ఖర్చులు పోను రోజుకు రూ.800 వరకు మిగిలేవి. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో రోజుకు రూ.200 కూడా రావడం లేదు. దీంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. మా పొట్ట కొట్టినట్లయింది.

– రామకూరి కామేశ్వరరావు, బోర్వంచ, నూజివీడు మండలం

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల జీవితం అయోమయంలో పడింది. ఉచిత బస్సు పథకం పెట్టకముందు రోజుకు రూ.1000 వచ్చేవి. ఇప్పుడు రూ.200 కూడా రావడం లేదు. నెలకు రూ.12 వేలు ఆటోకు ఈఎంఐ చెల్లించాల్సి ఉండటంతో ఏమి చేయాలో తెలియడం లేదు. పనులకు వెళ్దామంటే కూలి పనులు కూడా ఉండటం లేదు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– చిట్టిమాల రమేష్, గోపవరం, ముసునూరు మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం బైపాస్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరంలోని సూరిబాబు పేట, బస్టాండ్ ఏరియా, కోత మిషన్ ఏరియా, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, రాజాపేట, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, మాలపల్లి, చంద్రబాబు నగర్, నూజివీడు రోడ్డు, బైపాస్ రోడ్డు, దేవుని చెరువు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి: యూటీఎఫ్

మైలవరం: ఉపాధ్యాయులకు పాఠశాలల్లో బోధనేతర పనులు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ డిమాండ్ చేశారు. మైలవరం యూటీఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సెల్ఫ్ అసిస్మెంట్ పరీక్ష నిర్వహణను పాత పద్ధతిలో పేపర్ల మీద రాయించే విధానాన్ని కొనసాగించాలని, ఆన్‌లైన్ పనులు ఉపాధ్యాయులకు తగ్గించాలని కోరారు. కె.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సుందరయ్య, జిల్లా సహాధ్యక్షులు ఎం. కృష్ణయ్య తదితరులు మాట్లాడారు. యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు తెలియజేద్దాం



ఎ.కొండూరులో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: అధికార దాహంతో అలవికాని హామీలిచ్చిన సీఎం చంద్రబాబు ఏడాదిన్నర కాలంగా హామీల అమలు వాయిదా వేస్తూ ప్రజలను నిలువునా మోసగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. ఎ.కొండూరు అడ్డరోడ్డు మామిడి యార్డులో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరితో బీటెక్ తదితర కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పకడ్బందీగా అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కూటమి పాలకులు ఆచరణలో చతికిలబడ్డారని చెప్పారు. అరకొరగా తల్లికి వందనం అమలు చేసి, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంలోనూ ఆంక్షలు విధించి సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేసేశామని చెప్పుకోవడం కూటమి నేతలకే చెల్లిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే నవరత్నాలతో పాటు పలు వర్గాలకు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కగా, తొలి దశలోనే ప్రజల వ్యతిరేకత పొందడంలో కూటమి ప్రభుత్వం రికార్డు సాధించిందని స్వామిదాసు అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు తెలిపే క్యూ ఆర్ కోడ్లను ఆవిష్కరించారు. ఎ.కొండూరు జెడ్పీటీసీ సభ్యుడు భూక్యా గన్యా, పార్టీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎస్టీ విభాగం జిల్లా నాయకులు ధర్మానాయక్, బీసీ సెల్ నాయకులు వంకలపాటి సాంబశివరావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, నాయకులు వజ్రాల బ్రహ్మారెడ్డి, కాలసాని చెన్నారావు, తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామలక్ష్మారెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘తెలుగు తేజం’ పురస్కారాల ప్రదానం





పురస్కారం అందుకుంటున్న రఘునందన్, శిఖా ఆకాష్

నూజివీడు: వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన అభ్యుదయ కవి శిఖా ఆకాష్‌కు తెలుగు తేజం జాతీయ తెలుగు భాషా పురస్కారం అందజేశారు. భువనచంద్ర వేదికలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక కళా రంగాలకు సంబంధించిన శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు గడ్డం ఈశ్వరి బాయి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

రఘునందన్‌కు పురస్కారం ప్రదానం..

తిరువూరు: తిరువూరు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ బుక్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీ సంయుక్తంగా తెలుగుతేజం జాతీయ పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. నరసరావుపేట భువనచంద్ర హాల్లో జరిగిన సాహితీ కార్యక్రమంలో రఘునందన్‌కు అకాడమీ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి తదితరులు ఈ పురస్కారాన్ని అందజేశారు. రఘునందన్‌ను తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, సభ్యులు అభినందించారు.

శిథిలావస్థలో మీసేవా కేంద్రం



నూజివీడులో నిరుపయోగంగా ఉన్న మీసేవా కేంద్రం భవనం

నూజివీడు: పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఉన్న మీసేవా కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలో గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీసేవా కేంద్రాన్ని నడిపేవారు. మీసేవా కేంద్రాలను ప్రభుత్వం రద్దు చేయడంతో ఈ భవనం అప్పటి నుంచి నిరుపయోగంగా ఉంది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భవనాన్ని అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. అద్దె భవనాల్లో నడుస్తున్న వార్డు సచివాలయాలు, ఏదైనా ప్రభుత్వ కార్యాలయాన్ని ఇందులో ఏర్పాటు చేసి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావచ్చు. మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వదిలివేయడంతో అందులో ఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే ఫర్నిచర్ సైతం చెదలు పట్టి పాడవుతోంది. వార్డు సచివాలయాలను ప్రైవేటు బిల్డింగ్‌లో ఏర్పాటు చేసి నెలనెలా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఈ బిల్డింగ్‌లో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేస్తే మున్సిపాలిటీకీ ప్రజాధనం ఆదా అవడంతో పాటు భవనం కూడా వినియోగంలోకి వస్తుంది.

జైజై గణేశా.. బైబై గణేశా



ఆగిరిపల్లిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణేశుడు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న వినాయకుని విగ్రహాలను ఊరేగించి వాగుల్లో నిమజ్జనంచేశారు. మల్లేలలో మేళతాళాలు, కోలాట నృత్యాలతో గణపతి నిమజ్జనం జరిగింది.

మైలవరం: మైలవరం తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని ఆదివారం భక్తులు నిమజ్జనానికి తరలించారు. బొజ్జ గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆసీనుని చేసి ప్రధాన రహదారిలో మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు గ్రామంలో పూజలందుకున్న గణనాథుని విగ్రహాన్ని ఆదివారం గ్రామస్తులు మేళతాళాలతో ట్రాక్టర్‌పై ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. లడ్డు ప్రసాదం వేలం పాట నిర్వహించగా బొడ్డు విరాట్ సాయి రూ. 13 వేలకు పాడుకున్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గణేష్ కమిటీ సభ్యులు కాగితపు రాజేష్, రంగినేని సాయి సీతారామ్, బన్ను, వెంకటేష్, గోపి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండపాల వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. కొండపల్లి యాదవుల బజార్, మూలపాడు, గుంటుపల్లి గ్రామాల్లో విఘ్నేశ్వరుని నిమజ్జన కార్యక్రమాలు భారీ ఊరేగింపుతో నిర్వహించారు.
- మైలవరం: రెడ్డిగూడెం గ్రామం మిట్టగూడెంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, నాయకులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనలో భక్తులకు వడ్డించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలో పలుచోట్ల వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది.
- చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు జరిగాయి. చాట్రాయిలో బూరుగుగూడెం రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సుమారు 1,600 మందికి అన్నదానం చేశారు. అనంతరం డప్పు వాయిద్యాలతో యువకులు రంగులు చిమ్ముకుంటూ స్థానిక చెరువులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. చిన్నంపేటలో అన్నదానం నిర్వహించారు. చనుబండ అంబేడ్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



పైడూరుపాడులో వినాయక విగ్రహం ఊరేగింపు



ఇబ్రహీంపట్నంలో అన్నదానం



విస్సన్నపేటలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, లక్ష్మీ నరసింహ నగర్‌లోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, శ్రీకృష్ణ కమిటీ యువసేన, యాదవ యూత్ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై విగ్రహాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం మానవ అభివృద్ధికి తోడ్పడాలి

జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సాంకేతిక పరిజ్ఞానం మానవుల అభివృద్ధికి ఉపయోగ పడాలి తప్ప వినాశనానికి కాదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్ అన్నారు. కొండపల్లిలో జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సైన్స్ సాధించిన అభివృద్ధితో మారణాయుధాలు తయారు చేసి యుద్ధాలకు వాడటం బాధాకరమన్నారు. అనంతరం జరిగిన నూతన కమిటీలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెనిగళ్ల మురళీమోహన్, ఎల్.గంగాధర్ రెండోసారి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్లు ఎం.సీతారామారావు, రవీంద్ర, కోశాధికారిగా భానుప్రసాద్, ఉపాధ్యక్షులుగా కామేశ్వరరావు, శ్రీనివాస్, హరికృష్ణ, మల్లికార్జునరెడ్డి, కార్యదర్శులుగా రాంప్రదీప్, సుబ్బారావు, రవి, మస్తాన్‌వలి, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై ఆదేశాలు బేఖాతర్

ముసునూరు: సీఎం పేషీకి ఫిర్యాదు చేసినా పాఠశాలల్లో ఆక్రమణలు తొలగించక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు పాత హైస్కూల్ తరగతి గదులను స్థానికులు తమ ప్రైవేట్ అవసరాలకు వాడడం, టీడీపీ అనుయాయుడు షామియానా దుకాణం నడపడంపై గ్రామస్తులు నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు ఆక్రమణలు తొలగించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ నేతృత్వంలో పలు పర్యాయాలు క్షేత్ర పరిశీలన చేసి స్థానికులను విచారించారు. ఆక్రమణలు తొలగించక పోవడంతో స్థానికులు సాక్షాత్తూ సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవహారం తిరిగి మండల అధికారుల వద్దకు వచ్చింది. తక్షణం తొలగింపు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యదర్శి క్షేత్ర పరిశీలన చేసి ఆగస్టు 16 నాటికి ఖాళీ చేయిస్తామని చెప్పారు. అనంతరం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రేషన్ దుకాణాన్ని ఖాళీ చేయించారు. ఆగస్టు నెల పూర్తయినా షామియానా షాపును ఖాళీ చేయించలేదు. తక్షణం ప్రభుత్వ పాఠశాలను ఆక్రమించి నిర్వహిస్తున్న షామియానా షాపును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలమయంగా కలటూరు రోడ్డు



ఆగిరిపల్లి: మండలంలోని కలటూరు రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు రెండు కిలోమీటర్ల వరకు తారు రోడ్డు పూర్తిగా లేచిపోయి రాళ్లు తేలి ఉంది. పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం హంగామా చేసింది తప్ప ఈ రోడ్లకు మాత్రం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం సాగించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగుకో గుంత ఉండడంతో ఒళ్లు హూనమైపోతోందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. రోడ్డంతా రాళ్లు తేలి ఉండటం వల్ల టైర్లకు తగిలి ఎగిరి పడుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో చోరీకి యత్నం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ పాతగేటు సమీపంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో గుర్తుతెలియని నిందితుడు చోరీకి యత్నించాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. చోరీ ప్రయత్నంలో అలారం మోగడంతో అతను పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ మునీర్ అహ్మద్ శనివారం సాయంత్రం బ్యాంక్‌కు తాళాలు వేసి వెళ్లారు. తెల్లవారు జామున ముంబాయి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి బ్యాంక్‌లోకి చొరబడినట్లు అలారం మెసేజ్ వెళ్లింది. వారు బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. సింగ్‌నగర్‌లో ఉంటున్న మేనేజర్ హుటాహుటిన బ్యాంక్ వద్దకు చేరుకుని పరిశీలించగా బ్యాంక్‌కు వేసిన తాళాలు వేసినట్లు ఉన్నాయి. బ్యాంక్ షట్టర్ పక్కన బయటవైపు ఉన్న ఏటీఎంలో చోరీ యత్నం జరిగినట్లు గుర్తించారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి గుర్తింపు కోసం విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.